క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



కొత్తపేటలో ఆడుదాం క్రీడాజ్యోతితో పరుగుపెడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: క్రీడలు మానసిక వికాసానికి ఎంతో తోడ్పడతాయని, మన మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసి, మన గ్రామాల్లో ఉన్న క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసి యువతకు బంగారు భవితను అందించాలన్న గొప్ప ఆలోచనతో చేస్తున్న మహత్తర కార్యక్రమం ఈ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి క్రీడాకారులకు అందజేశారు. అలాగే వాలీబాల్ ఆడి అలరించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లో జరిగిన పోటీల్లో పురుషుల కబడ్డీ పోటీల్లో ఆలమూరు మండలం ప్రథమ, రావులపాలెం మండలం ద్వితీయ, కొత్తపేట మండలం తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో కొత్తపేట ప్రథమ, ఆత్రేయపురం ద్వితీయ, రావులపాలెం మండలాలు తృతీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ జి.రమాదేవి, ఏఎంసీ చైర్మన్ రవీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాల వీరభద్రరావు, వైసీ రామన్న, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో ముక్కంటి, ఎంపీడీఓ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు స్థానిక ఏఎఫ్‌డీటీ కాలేజీ క్రీడాప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అమలాపురం డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పీవీ థామస్ ప్రారంభించారు. నాలుగు మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 24,25 తేదీల్లో క్రికెట్, 27న కబడ్డీ, షటిల్, 29న ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొనగా ఏవో జి.మిల్టన్, పంచాయతీ సెక్రటరీలు బి.శ్రీహరి, అబ్బాస్ అలీ, ఎస్‌డీ సత్యప్రసాద్ క్రికెట్ పోటీలు నిర్వహించారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చాటారని కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి పి.త్రిమూర్తులు బుధవారం తెలిపారు. రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన 40వ జాతీయ స్థాయి జూనియర్స్, సీనియర్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు. సీనియర్స్ ఫైట్ విభాగంలో కె.వైష్ణవి బంగారు పతకం సాధించింది. బీహెచ్ రమ్య వెండి పతకం సాధించింది. పాట్రన్‌లో పి.భార్గవిశ్రీకళ, కె.వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు. విజేతల్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్, హెచ్‌ఎం సాయిరామ్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

వ్యాసరచనలో మామిడికుదురు విద్యార్థి ప్రతిభ



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మామిడికుదురు విద్యార్థి శ్రీరామ్

మామిడికుదురు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీలో మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కేపీఎస్ఎస్ శ్రీరామ్ ద్వితీయ బహుమతిని సాధించాడు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం-1994లో భాగంగా 'ఆడ శిశువును కాపాడుదాం-సృష్టిని రక్షిద్దాం' అనే నినాదంతో వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో శ్రీరామ్ ద్వితీయ బహుమతిని సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని బుధవారం తెలిపారు. ద్వితీయ బహుమతిని సాధించిన శ్రీరామ్‌కు కలెక్టర్ హిమాన్షు శుక్లా అమలాపురంలో జరిగిన సమావేశంలో ప్రశంసా పత్రం అందించి సన్మానించారని చెప్పారు. వ్యాస రచన పోటీలో ప్రతిభ చూపిన శ్రీరామ్‌ను హెచ్‌ఎం నిరంజనితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు అభినందించారు.

చిన్న నిర్లక్ష్యం.. పెను ప్రమాదం

- ఫిబ్రవరి 14 వరకూ రోడ్డు భద్రతా వారోత్సవాలు
- క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు
- మానవ తప్పిదాల నివారణే లక్ష్యం



మూలస్థాన అగ్రహారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

ఆలమూరు: ఒక చిన్న ప్రమాదం.. పెను ప్రమాదం సంభవించేలా చేస్తుంది. నిండు ప్రాణాల్ని బలిగొంటున్నాయి. అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. మరెందరో అనాథలవుతున్నారు.రహదారులపై ప్రయాణించేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాల నుంచి తమకు తాము రక్షించుకోవచ్చు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ వారి ప్రాణమే కాదు వారిపై ఆధారపడ్డ కుటుంబాలు ఉన్నాయనే విషయం మరిచిపోవద్దు. ఇటీవల కాలంలో సంభవించిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా అనేక మంది క్షతగాత్రులయ్యారు. పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా ప్రయాణం సాగిస్తే కొంతమేరకైనా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెబుతుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకూ భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో మాసోత్సవాలు

రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీసు, రహదారి, రవాణాశాఖాధికారులు సంయుక్తంగా పర్యటించి పలు ముఖ్య కూడళ్ల వద్ద వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న సదస్సుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. రోడ్డు నిబంధనలను వివరించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మితిమీరిన వేగం కలిగే అనర్థాలను సమగ్రంగా తెలియజేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లా పరిధిలో ఇప్పటి వరకూ 536 ప్రమాదాలు జరగ్గా అందులో 164 మంది మృత్యువాత పడ్డారు. 194 మందికి తీవ్రగాయాలు కాగా 64 మందికి పాక్షిక గాయాలయ్యాయి. అయితే అధికారిక గణాంకాలు కాకుండా మరెంత మందో గాయపడిన సంఘటనలున్నాయి.

ద్విచక్ర వాహనాల వల్లే అధిక ప్రమాదాలు

రహదారుల ప్రమాదాల్లో అధిక శాతం కేవలం ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతుందని రవాణాశాఖ గణాంకాలను బట్టి తెలుస్తోంది. జాతీయ రహదారుల్లో వేగాన్ని కొలిచే పరికరాలను ఏర్పాటు చేసినా ప్రమాదాలు తప్పడం లేదు. ఏటా ద్విచక్ర వాహనాల వల్ల 44 శాతం, నాలుగు చక్రాల వాహనాల వల్ల 38 శాతం ప్రమాదాలు జరుగుతుండగా మిగిలిన ప్రమాదాలన్నీ స్వయంకృత ప్రమాదాలుగా నిర్ధారించారు. కొత్తపేట నియోజవర్గంలోని ఆలమూరు మండలంలో అత్యధికంగా జాతీయ రహదారి 17 కిలోమీటర్లు వ్యాపించి ఉంది. అలాగే రావులపాలెం-అమలాపురం, రావులపాలెం-రాజోలు, జొన్నాడ-కాకినాడ ప్రధాన రహదారులున్నాయి. ఈ రహదారుల్లో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో అత్యధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నివారణకు జాగ్రత్తలు

- రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలి.
- అపసవ్య దిశలో ప్రయాణించరాదు. ఎడమవైపునే వెళ్లాలి.
- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.
- కారు నడిపే వారు, ప్రయాణించే వారు కచ్చితంగా సీటు బెల్ట్ ధరించాలి.
- అలసటగా ఉన్న వారు, అనారోగ్యంతో ఉన్న వారు వాహనాలను నడపరాదు.
- భారీ వాహనాలు నడిపేవారు అవసరమైనంత మేరకు విశ్రాంతి తీసుకోవాలి.
- వాహనాలను నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడరాదు, ఇయర్స్ ఫోన్స్ వాడరాదు.
- పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం సాగించవద్దు.

నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు



వాహనదారులు ప్రయాణించేటప్పుడు ఖచ్చితమైన నిబంధనలు పాటించాలి. నిర్లక్షాన్ని వీడటం ద్వారా అధిక శాతం ప్రమాదాలు నివారించవచ్చు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చున్నవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– ఎల్.శ్రీనునాయక్, ఆలమూరు

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఇరుసుమండలో తాగునీటి పైప్ లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలంలోని ఇరుసుమండలో జేజేఎం నిధులతో నిర్మించనున్న మంచినీటి పైప్ లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం భూమి పూజ చేశారు. అలాగే కత్తిమండలో రూ.38 లక్షల జల్‌జీవన్ నిధులతో పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. కత్తిమండలో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు కూడా ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. కరవాక, చింతలమోరి ఆర్అండ్‌బీ రోడ్డు పనులు పూర్తి కావస్తున్నాయని, లక్కవరం చింతలపల్లి రోడ్డు పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలన్నీ పరిష్కరించి ఎన్నికలకు వస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచ్‌లు వలవల అమ్మాజీ, ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ చిట్టాల శ్రీనివాస్, నాయకులు ముప్పర్తి త్రిమూర్తులు, వలవల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- అనవసర విమర్శలు చేయవద్దని హితవు



సఖినేటిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో అభివృద్ధి ఇపుడు జరిగింది తప్ప గతంలో లేదని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వంపై అనవసర బురద చల్లవద్దని, అనవసర విమర్శలు చేయవద్దని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే హితవు పలికారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రజలకు అవసరమైన పనులన్నీ పూర్తి చేస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు మాటల్లో నిజం లేదన్నారు. అంతర్వేది తీరంలో తాగునీటి సమస్య గురించి ఆలోచన చేసింది, పనులు చేపట్టింది ప్రస్తుత ప్రభుత్వమేనన్నారు. పనిగట్టుకుని విమర్శలు చేయడం తప్పించి ప్రతిపక్షాలు చేసేది ఏమీ లేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేసేందుకు బృహత్తర ప్రణాళికలతో ఉన్నామన్నారు. అనంతరం ఎంపీడీవో బడుగు మంగాదేవి శాఖల వారీగా రివ్యూ చేశారు. తొలుత మోరి వెటర్నరీ ఆసుపత్రిలో డాక్టర్ కొరత, ఆస్పత్రిలో పశువులకు సంబంధించిన మందులు రైతులకు ఇవ్వకపోవడం వంటివి తన దృష్టికి వచ్చినట్లు, ఈ సమస్య పరిష్కరించాలని అంటూ ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ శాఖ జేడీతో తక్షణం సంప్రదిస్తానని హామీ ఇచ్చారు. కాగా సమావేశానికి హాజరు కాని ఆయా శాఖల అధికారులపై తగిన దృష్టి పెట్టాలని ఎంపీడీవోకు ఎమ్మెల్యే సూచించారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలపై ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ వివరించారు. నాడు, నేడు పథకంలో ఫేజ్-1లో పాఠశాలలో సక్సెస్‌ఫుల్‌గా పనులను పూర్తి చేశామన్నారు. ఈ దశలో గొంది ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్ మాట్లాడుతూ, విద్యారంగానికి అత్యధిక నిధులు ఇస్తున్నది ప్రస్తుత ప్రభుత్వమేనని అన్నారు. అంతర్వేదిపాలెంలో బాలికల, రామేశ్వరంలో కో ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తగిన సహకరించాలని ఎంఈవో, ఎంపీపీ మల్లిబాబు కోరారు. సఖినేటిపల్లి రేవు వద్ద పంటుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రాకపోకలకు వెసులుబాటు కల్పించేలా రేవు పాటదారులతో మాట్లాడతానని దేవస్థానం ఎంపీటీసీ బైరా నాగరాజు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఎంపీపీ బదులిచ్చారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు వెంకట నరసింహ శ్రీ పద్మరాజు, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, పీఏసీఎస్ అధ్యక్షులు డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, ముప్పర్తి త్రిమూర్తులు, వైద్యాధికారులు ఎ.పూర్ణ చంద్ర కుమార్, ఎండీ యునుస్, పంచాయతీరాజ్, ఎన్ఆర్‌జీఎస్, ఐసీడీఎస్, డ్రెయిన్స్, హౌసింగ్, అగ్రికల్చర్ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

రావులపాలెం: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం అమలాపురం కాలువలో దొరకడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొమరాజులంక గ్రామానికి చెందిన నల్ల శివ రామాంజనేయులు (31) ఈనెల 11న కనిపించకుండా వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు 15న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తుండగా బుధవారం సత్యనారాయణ మృతదేహం ముక్కామల దాటిన తర్వాత అమలాపురం రూరల్ పరిధి నడిపూడి లాకుల వద్ద కాలువలో దొరికినట్లు బంధువులు గుర్తించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు




రావులపాలెంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ఎటువంటి భేదాలు చూడకుండా పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మహిళలకు అందజేశారు. తొలుత మాజీ సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆసరా పథకంతో డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.219.60 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమం చూసి ఇంతకు మించి మనం ఏం చేయగలం అని టీడీపీ వాళ్లు భయపడుతున్నారన్నారు. ప్రతి గడపకూ తిరిగి మేము అందించిన సంక్షేమం గురించి వివరించి, కరపత్రం అందజేశామని కానీ టీడీపీ గతంలో ఏం చేసిందో వాళ్ల నాయకులకి కూడా తెలీదని మరలా ప్రజలను మోసం చేయడానికి బూటకపు హామీలతో బయలుదేరారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 4 విడతల వైఎస్సార్ ఆసరా పథకంతో ఆడపడుచులకు ఆత్రేయపురం మండలంలో రూ.41.2 కోట్లు, రావులపాలెం మండలంలో రూ.54.86 కోట్లు, కొత్తపేట మండలంలో రూ.63.34 కోట్లు, ఆలమూరు మండలంలో రూ.60.8 కోట్ల లబ్ధి మొత్తంగా నియోజకవర్గంలో మొత్తం 63,330 మంది లబ్ధిదారులకు రూ.219.60 కోట్ల లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.అనంతరం డ్వాక్రా మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే డ్వాక్రా మహిళలకు డ్రా తీసి కుక్కర్లు పంపిణీ చేశారు. అలాగే వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కేతరాజుపల్లి సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దాం



ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తూ వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రులన్నింటినీ దశల వారీగా కార్పొరేట్ ఆస్పత్రులుగా తీర్చిదిద్ది మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఆలమూరులోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ)ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సమకూర్చిన ఆధునిక యంత్రాల వివరాలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పారిశుధ్య చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటి వరకూ అందించిన సేవలు కోలుకున్న రోగుల సంఖ్యపై ఆరా తీశారు. ఈసందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి టి.గోపిరామ్ మాట్లాడుతూ ఇటీవల సుమారు రూ.20 లక్షలతో కొనుగోలు చేసిన ఫుల్లీ ఆటోమేటిక్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్ (ఎక్సెల్ 640), సెల్ కౌంటర్, ఈసీఎల్ ఎనలైజర్ తదితర యంత్ర పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఈ యంత్రాల వల్ల అధిక సంఖ్యలో రోగులకు రక్త పరీక్షలు చేసేందుకు అవకాశం లభించిందన్నారు. ఒకసారి రక్త నమూనా తీసుకుంటే దాదాపు 50 వరకూ రక్త పరీక్షలు చేసేందుకు ఆ యంత్ర పరికరాలు దోహదపడతాయని తెలియజేశారు. ప్రైవేట్ ల్యాబ్‌లకు దీటుగా తమ ల్యాబ్ టెక్నీషియన్లు సేవలందిస్తున్నారని తెలియజేశారు. ఆలమూరులో సుమారు రూ.ఆరు కోట్లతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన సీహెచ్‌సీని పరిసర ప్రాంత రోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కోరారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఉండమట్ల బూరయ్య, నామన దుర్గా ప్రసాద్, లాబ్ ఆరోగ్యమిత్ర నామాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకుడు 'పొన్నాడ'



పొన్నాడ జీవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీతారామారావు తదితరులు

రాజోలు: ప్రముఖ న్యాయవాది దివంగత డాక్టర్ పొన్నాడ హనుమంతరావు భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకుడిగా నిలిచారని ప్రముఖ నేత్ర వైద్యనిపుణుడు సీతారామారావు అన్నారు. బుధవారం రాజోలులోని గాంధీహౌస్ ప్రాంగణంలో హనుమంతరావు ప్రథమ సంస్మరణ సభ నిర్వహించారు. పొన్నాడ కుటుంబీకులు నూతనంగా ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే పొదలాడకు చెందిన కవి, కథకుడు, జీవిత చరిత్రకారుడు ఎమ్మెస్ సూర్యనారాయణ రచించిన 'జ్ఞాన గుణవంతా..జయ హనుమంతా..పొన్నాడ జీవన ప్రస్థానం' పుస్తకాన్ని డాక్టర్ సీతారామారావు ఆవిష్కరించారు. న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'జ్ఞాన గుణవంతా.. జయ హనుమంతా.. పొన్నాడ జీవన ప్రస్థానం' పుస్తకాన్ని వాడ్రేవు సుందరరావు, 'రాజోలు కథలు' పుస్తకాన్ని సుంకర గోపాలయ్య పరిచయం చేశారు. సంఘ సంస్కర్తగా, గాంధేయవాదిగా, సర్పంచ్‌గా రాజోలు అభివృద్ధికి హనుమంతరావు ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. రాజోలు వాసుల మదిలో హనుమంతరావు చిరస్థాయిగా నిలిచేలా నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఆయన కుమారులు పొన్నాడ సురేష్, సూర్యప్రకాష్‌లను పలువురు అభినందించారు. రాజోలు పుర ప్రముఖులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నోటితో మంత్రాలే కాదు.. బ్యాట్‌తో సిక్సర్లు కొడతాం..



క్రికెట్ టీమ్‌ను పరిచయం చేసుకుంటున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అయినవిల్లి: మంత్రోచ్చారణ చేయాల్సిన పురోహితులు చేతితో బ్యాట్ పట్టి సిక్సర్లు కొడుతూ క్రికెటర్లకు మేము ఏమి తక్కువ కాదని యువ పురోహితులు నిరూపించారు. మండలంలోని ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌ను అమలాపురం పురోహిత సంఘ ఆధ్వర్యంలో ప్రారంభించారు. యువ పురోహిత క్రికెట్ జట్లను స్థానిక బ్రాహ్మణ సంఘం నాయకుడు అయినవిల్లి మాజీ సర్పంచ్ అద్దాల రాంబాబు పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు భీమవరం జట్టుపై విజయవాడ జట్టు తలపడ్డాయి. పది పరుగులు తేడాతో భీమవరం జట్టుపై విజయవాడ జట్టు విజయం సాధించింది. అలాగే అన్నవరం జట్టు ఖమ్మం జట్టుతో తలపడగా ఏడు వికెట్ల తేడాతో ఖమ్మం జట్టుపై అన్నవరం జట్టు విజయం సాధించింది. లీగ్ మ్యాచ్‌లు 24, 25, 26 తేదీల్లో జరుగుతాయని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కర్రా బాబి, ఉపద్రష్ట విజయ్, గండికోట సాయి, మహేంద్ర, అక్షయ్, విక్రమ్ తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు.